మన సమగ్ర
RNI NO:TGTEL/25/A5443
# ప్రజావాణి
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | మంగళవారం 27 అక్టోబర్ 2026 | సంపుటి : 01 | సంచిక : 297 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | Tuesday, 27 October 2026 | Volume : 01 | Issue : 297 | Pages : 12 | Cost : 2/- |

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
( కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత )
Ph: 9440032006

## ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం



- ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్
- విజయవాడలో ఎన్టీఆర్ వర్సిటీ 40వ వార్షికోత్సవం
- ముఖ్య అతిథిగా ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్
- విద్యా, వైద్య రంగాలకు ఎన్టీఆర్ సేవలను కొనియాడిన ఉపరాష్ట్రపతి

**అమరావతి/హైదారాబాద్**

భవిష్యత్తులో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నుంచి నోబెల్ బహుమతి గ్రహీతలు రావాలని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వర్సిటీ 40వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యా, వైద్య, సంక్షేమ, సాంస్కృతిక రంగాలతో పాటు తెలుగు భాషాభివృద్ధికి దివంగత ఎన్టీ రామారావు అందించిన సేవలను ఆయన కొనియాడారు. దేశంలోనే తొలి హెల్త్ యూనివర్సిటీని స్థాపించడంలో ఎన్టీఆర్ చూపిన దూరదృష్టి ప్రశంసనీయమని అన్నారు. తెలుగు గంగ ప్రాజెక్టు ద్వారా చెన్నైకి తాగునీరు అందించిన ఆయన మానవతా దృక్పథాన్ని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో వికసిత భారత్ 2047 లక్ష్యానికి అనుగుణంగా గత 12 ఏళ్లలో దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీలు, సీట్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని రాధాకృష్ణన్ తెలిపారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కొత్త పరిష్కారాలు కనుగొనేందుకు వర్సిటీ విద్యార్థులు అంతర్జాతీయ పరిశోధనల్లో రాణించాలని సూచించారు. వైద్య రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ టెక్నాలజీల ప్రాధాన్యం - మిగతా3లో

## తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు

- హాజరుకానున్న మోదీ, అమిత్ షా
- డిసెంబర్ 4 నుంచి 6 వరకు తిరుపతిలో డీజీపీ, ఐజీల సదస్సు
- హాజరుకానున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- తిరుపతి ఐసర్‌లో జరగనున్న జాతీయ స్థాయి సమావేశం
- ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష
- పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశం





## హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర

- కాంగ్రెస్ ర్యాలీకి మరుసటి రోజే బీజేపీ కౌంటర్!
- నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర
- అమిత్ షా పాల్గొంటారని రామచందర్‌రావు ప్రకటన

## 'అర్ణబ్' తుపానుపై వదంతులు నమ్మొద్దు



- అప్రమత్తతో గండం నుంచి బయటపడదాం
- బంగాళాఖాతంలో 'అర్ణబ్' తుపాను
- రేపటికి అతి తీవ్ర తుపానుగా మారనున్న వైనం
- అక్టోబర్ 28న బాపట్ల-విశాఖ మధ్య తీరం దాటే అవకాశం
- ఏపీ, దక్షిణ ఒడిశా తీరాలకు రెడ్ అలర్ట్ జారీ
- గంటకు 140 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం
- రైతులు, మత్స్యకారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన

## అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం



- ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన రాంచందర్ రావు
- ప్రధాని తండ్రిని ఉద్దేశించి ఖర్గే వివాదాస్పద వ్యాఖ్యలు
- తీవ్రంగా ఖండించిన తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు

## మలేరియా వ్యాక్సిన్ ధర 40 శాతం తగ్గింపు..

- మరో 10 లక్షల మంది పిల్లలకు రక్షణ!
- ఒక్క డోసు ధర రూ.600 లోపే
- 2027 ప్రారంభం నుంచి కొత్త ధర అమలు
- మూడేళ్లలో 50 మిలియన్ డాలర్ల ఆదా
- మరో 10 లక్షల మంది పిల్లలకు టీకా అవకాశం
- నాలుగు డోసులతో మలేరియా కేసులు తగ్గే అవకాశం
- ఆఫ్రికా దేశాల్లో వ్యాక్సిన్ పంపిణీకి ప్రాధాన్యం





## అర్నాబ్ తుపాను ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్..!

## రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

- తుమ్మిడిహెట్టిపై గుడ్‌న్యూస్..
- తెలంగాణ ప్రతిపాదనకు ఫడ్నవీస్ సానుకూలం!
- తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపుపై ఫడ్నవీస్ సానుకూలం
- 152 మీటర్లకు పెంచాలని తెలంగాణ ప్రతిపాదన
- అధ్యయనానికి అధికారుల కమిటీ ప్రతిపాదన
- ముంపు భూములకు పరిహారం చెల్లిస్తామని హామీ



**హైదారాబాద్**

తెలంగాణలోని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల సాగునీటి కల నెరవేరే దిశగా కీలక ముందడుగు పడింది. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 152 మీటర్లకు పెంచాలన్న తెలంగాణ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. ఎత్తు పెంపుతో మహారాష్ట్రకు ఎలాంటి ప్రతికూల ప్రభావం ఉండకూడదని స్పష్టం చేస్తూనే.. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు అభ్యంతరం లేదని తెలిపారు. అయితే, బ్యారేజీ ఎత్తు పెంపుపై తుది నిర్ణయం తీసుకునే ముందు అన్ని అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాల్సి ఉందని అన్నారు. ముంబైలోని సహ్యాద్రి రాష్ట్ర అతిథిగృహంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం ఫడ్నవీస్‌తో సోమవారం సమావేశమైంది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహా ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. గతంలో రెండు రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం బ్యారేజీ ఎత్తు 148 - మిగతా3లో

## షాకింగ్ ఘటన.. భవనం అంచున వేలాడిన మృతదేహం.. గుట్కా ఉమ్మేస్తూ కరెంట్ షాక్‌తో వృద్ధుడి మృతి!



- మధ్యప్రదేశ్‌లో విషాదం.. గుట్కా ఉమ్మేస్తూ వృద్ధుడి మృతి
- బాల్కనీ నుంచి ఉమ్మేస్తుండగా 11కేవీ విద్యుత్ తీగలు తగిలి దుర్మరణం
- భవనానికి సమీపంలో విద్యుత్ లైన్లు.. మార్చాలని అధికారులను కోరుతున్న ప్రజలు
- కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
మంగళవారం 27 అక్టోబర్ 2026

# ‘అర్ణబ్’ తుపానుపై వదంతులు నమ్మొద్దు..

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం నేడు తుపానుగా మారింది. ఈ తుపానుకు ‘అర్ణబ్’ అని నామకరణం చేశారు. ‘అర్ణబ్’ తుపాను ఏపీ దిశగా వస్తోందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అనవసరమైన వదంతులను నమ్మవద్దని, కేవలం అధికారిక సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భారత వాతావరణ శాఖ (×వీణ), విపత్తు నిర్వహణ శాఖ, జిల్లా యంత్రాంగం ఇచ్చే సూచనలను మాత్రమే పాటించాలని సోమవారం స్పష్టం చేశారు. ఈ విపత్కర సమయంలో ప్రజలందరూ సమన్వయంతో, ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించి తుపాను గండం నుంచి సురక్షితంగా బయటపడాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంత్రి సోషల్ మీడియా ద్వారా ప్రజలకు సూచనలు జారీ చేశారు.



### తీరం దాటేది అప్పుడే.. రెడ్ అలర్ట్ జారీ

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ‘అర్ణబ్’ తుపానుగా మారి వేగంగా బలపడుతోందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అక్టోబర్ 26, సోమవారం అర్ధరాత్రికి తీవ్ర తుపానుగా, మరుసటి రోజు అక్టోబర్ 27న అతి తీవ్ర తుపానుగా మారనుందని తెలిపారు. అక్టోబర్ 28, బుధవారం ఉదయం బాపట్ల-విశాఖపట్నం మధ్య తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్లు, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీచే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 27, 28 తేదీల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని, ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిశా తీరప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు.

### ప్రాణరక్షణకే తొలి ప్రాధాన్యం

ఈ విపత్తు సమయంలో ప్రజల ప్రాణరక్షణకే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. తీర, లోతట్టు ప్రాంతాల ప్రజలు తక్షణమే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని కోరారు. ప్రతి ఒక్కరూ అత్యవసర మందులు, తాగునీరు, ఆహార పొట్లాలు, టార్చ్‌లైట్లు, బ్యాటరీలు, ముఖ్యమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. బలహీనమైన భవనాలు, చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులకు దూరంగా ఉండాలని, వర్షాలు, పిడుగుల సమయంలో బయటకు రావద్దని హెచ్చరించారు. మత్స్యకారులు ఎవరూ సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని, ఇప్పటికే వెళ్లినవారు వెంటనే తీరానికి చేరుకోవాలని ఆదేశించారు.

### రైతన్నలకు ప్రత్యేక సూచనలు

రైతులు తమ పంటలను కాపాడుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ వంటి పంటలను వాతావరణం అనుకూలించగానే కోసి, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. ధాన్యం రాశులు, ఇతర ఉత్పత్తులను టార్పాలిన్లతో కప్పి భద్రపరచుకోవాలన్నారు. అరటి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకు ఊతంగా కర్రలు ఏర్పాటు చేసుకోవాలని, పొలాల్లో నీరు నిలిచిపోకుండా మురుగు కాలువలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను ఎత్తైన, సురక్షిత ప్రదేశాల్లో ఉంచాలన్నారు. అయితే, పంటలను కాపాడే ప్రయత్నంలో రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ ప్రాణాలను పణంగా పెట్టవద్దని ఆయన గట్టిగా కోరారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్యశాఖ అధికారుల సలహాలను పాటిస్తూ ఈ విపత్తును ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు.

## ఎన్టీఆర్ దూరదృష్టి ప్రశంసనీయం

-మొదటిపేజీ తరువాయి

పెరుగుతున్నప్పటికీ, వైద్యులు మానవత్వాన్ని ఎన్నడూ మరువరాదని ఆయన హితవు పలికారు. రోగుల పట్ల కరుణ, మానవత్వం, ఆత్మీయత చూపడమే వైద్య వృత్తిలో అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సమాజంలో మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు, దాని దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించేందుకు వైద్యులు, యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## రెండు లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

మీటర్లుగా ఉంది. అయితే, ఆ ఎత్తుతో ఆశించిన స్థాయిలో నీటిని తరలించడం సాధ్యం కాదని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్లకు పెంచాలని కోరుతోంది.

### అధ్యయనానికి అధికారుల కమిటీ

బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యత, ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలు, పరిహారం వంటి అంశాలపై రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. అవసరమైతే ప్రత్యామ్నాయాలపైనా అధ్యయనం చేయాలని సూచించారు. కేంద్ర జల సంఘం కూడా తన పరిధిలో సాంకేతిక అంశాలను పరిశీలించనుంది.

### రెండు లక్షల ఎకరాలకు సాగునీరు

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సుమారు రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలన్నది తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం. గిరిజన, అటవీ ప్రాంతాల్లో సాగు, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రాజెక్టు కీలకమని రేవంత్‌రెడ్డి వివరించారు. బ్యారేజీ వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములకు అక్కడి నిబంధనల ప్రకారం పూర్తి పరిహారం చెల్లిస్తామని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. బ్యారేజీ ఎత్తు ఖరారైతే తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గం రూపకల్పన, భూసేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. చర్చలు సానుకూలంగా సాగినా.. నిర్మాణానికి తుది అనుమతి లభించిందని ఇప్పుడే చెప్పలేం. అధికారుల అధ్యయనం, తదుపరి చర్చల తర్వాతే దీనిపై స్పష్టత రానుంది.

## అధికారానికి దూరమవడంతో కాంగ్రెస్‌లో అసహనం



ప్రధాని మోదీని ఉద్దేశించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అంతటి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నేత ఇంత దిగజారుడు భాష మాట్లాడటం అత్యంత విచారకరమని అన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రాంచందర్ రావు... గత పన్నెండున్నర ఏళ్లుగా అధికారానికి దూరంగా ఉండటంతో కాంగ్రెస్ నేతల్లో తీవ్రమైన అసహనం కనిపిస్తోందని విమర్శించారు. ఆ నిరాశా నిస్పృహల నుంచే మోదీ తండ్రిని కూడా నిందిస్తూ ఖర్గే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఖర్గే మాట్లాడిన సభలో వేదికపై ఉన్న నేతల కంటే కింద ఉన్న ప్రేక్షకులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీహార్‌లోని పాట్నాలో నిన్న జరిగిన ఓ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే ప్రసంగిస్తుండగా... ఓ వ్యక్తి మోదీ ఓడిపోరంటూ నినాదాలు చేశారు. దీనికి స్పందించిన ఖర్గే.. ‘మోదీ కా బాప్ భీ జాయేగా’ (మోదీ అబ్బ కూడా దిగిపోవాల్సిందే) అంటూ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపాయి. కేంద్ర హోం మంత్రి అమిత్ షా సహా పలువురు బీజేపీ నేతలు ఖర్గే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనపై పాట్నాలోని పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు కూడా చేశారు. దీంతో ఈ వివాదం మరింత ముదిరింది.

# హైదరాబాద్‌లో అమిత్ షా పాదయాత్ర..

తెలంగాణలో ఓట్ల తొలగింపు అంశంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కుతోంది. నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ నిర్వహించనున్న ‘ఓట్ చోరీ’ వ్యతిరేక ర్యాలీకి మరుసటి రోజే హైదరాబాద్‌లో బీజేపీ పాదయాత్ర చేపట్టనుంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా నవంబర్ 2న ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ‘లోక్‌తంత్ర బచావో - అరాజకతా హటావో’ (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకాన్ని అడ్డుకోండి) నినాదంతో ఈ యాత్ర నిర్వహించనున్నట్లు తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు వెల్లడించారు. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)పై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని రామచందర్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో, దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఆరోపణలకు సమాధానంగా ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రామచందర్‌రావు సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లికి తనతో కలిసి రావాలని, అక్కడ ఓటర్ల జాబితా నుంచి ఎన్ని పేర్లు తొలగించారో పరిశీలిద్దామని అన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించినట్లు ఆధారాలున్న కనీసం పది మంది ఓటర్ల వివరాలను చూపించాలని తెలంగాణ కాంగ్రెస్ మంత్రులను కోరారు. అర్హులైన ఓటర్లు తమ పేర్లను మళ్లీ చేర్చుకునేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఎస్ఐఆర్‌లో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారన్న ప్రతిపక్ష వాదనలో వాస్తవాలను పరిశీలించాలని రామచందర్‌రావు అన్నారు. ఆ సంఖ్యలో మరణించినవారు, చిరునామా మారినవారు, అందుబాటులో లేనివారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్నవారు ఉన్నారని పేర్కొన్నారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ ‘ఓట్ చోరీ’ ఆరోపణలపై భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండగా, బీజేపీ ఆ ఆరోపణలను ఖండిస్తోంది. ఈ నేపథ్యంలో రెండు పార్టీల కార్యక్రమాలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రామచందర్‌రావు తెలంగాణలో వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఢిల్లీ ర్యాలీకి వెళ్లడంపై కూడా విమర్శలు చేశారు. రాష్ట్రంలోని 600కు పైగా మండలాల్లో 300కుపైగా మండలాలు కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని, హైదరాబాద్‌లో రోజుకు సుమారు 8,000 వాటర్ ట్యాంకర్లకు బుకింగ్‌లు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.



# అర్నాబ్ తుపాను ఎఫెక్ట్.. పాపికొండలు విహారయాత్రకు బ్రేక్..!

బంగాళాఖాతంలో ఏర్పడిన ‘అర్నాబ్ తుపాను తీరంవైపు దూసుకొస్తున్న నేపథ్యంలో పర్యాటకుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ఈరోజు నుంచి గోదావరి నదిలో పర్యాటక బోట్ల రాకపోకలను పూర్తిగా రద్దుచేస్తూ రంపచోడవరం సబ్-కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తుపాను ప్రభావంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు, బలమైనగాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. రాజమండ్రి, భద్రాచలం తదితర ప్రాంతాల నుంచి సర్వీసులు నడిపే సుమారు 16 పర్యాటక బోట్లను నిలిపివేశారు. గతంలో గోదావరికి వచ్చిన భారీ వరదల కారణంగా సుమారు 70 రోజులపాటు నిలిచిపోయిన పాపికొండల యాత్ర, కేవలం రెండు వారాల క్రితమే తిరిగి ప్రారంభమైంది. అప్పుడే పర్యాటకుల రాక కూడా పుంజుకుంటోంది. ఆదివారం ఒక్కరోజే మూడు బోట్లలో దాదాపు 199 మంది పర్యాటకులు పాపికొండల అందాలను వీక్షించారు. ఇంతలోనే తుపాను ముప్పు ముంచుకు రావడంతో యాత్రకు మరోసారి బ్రేక్ పడింది. తుపాను ప్రభావం పూర్తిగా తగ్గిన తర్వాత, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారితేనే బోటింగ్ సేవలను పునరుద్ధరిస్తామని అధికారులు స్పష్టంచేశారు. పర్యాటకులు ప్రస్తుతానికి గోదావరి నదీ ప్రాంతాలకు రావొద్దని సూచించారు.



## షాకింగ్ ఘటన..
## భవనం అంచున వేలాడిన మృతదేహం..
## గుట్కా ఉమ్మేస్తూ కరెంట్ షాక్‌తో వృద్ధుడి మృతి!



మధ్యప్రదేశ్‌లోని విదిశ జిల్లాలో ఒక విషాదకరమైన, షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. గుట్కా ఉమ్మేసేందుకు బాల్కనీ వద్దకు వచ్చిన ఓ 60 ఏళ్ల వృద్ధుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. నిర్మాణంలో ఉన్న భవనంలో ఈ దుర్ఘటన జరగడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మృతుడు తాను అద్దెకు ఉంటున్న ఒక నిర్మాణంలో ఉన్న భవనం బాల్కనీ నుంచి బయటకు గుట్కా ఉమ్మివేసే ప్రయత్నం చేశాడు. అదే సమయంలో భవనానికి అత్యంత సమీపంగా వెళుతున్న 11 కేవీ హై-టెన్షన్ విద్యుత్ తీగలు అతడికి తగిలాయి. దాంతో కరెంట్ షాక్‌తో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యుదాఘాతం తీవ్రతకు అతడి శరీరం భవనం అంచున వేలాడుతూ కనిపించడంతో ఆ ప్రాంతంలో భయాందోళన వాతావరణం నెలకొంది. ఈ దృశ్యాన్ని చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతదేహాన్ని కిందకు దించి, పోస్టుమార్టం నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనానికి ఇంత దగ్గరగా హై-టెన్షన్ విద్యుత్ లైన్లు ఉండటం అత్యంత ప్రమాదకరమని వారు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని, వెంటనే ఆ విద్యుత్ లైన్లను అక్కడి నుంచి వేరేచోటికి మార్చాలని లేదా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని వారు విద్యుత్ శాఖ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఈ దుర్ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

## మలేరియా వ్యాక్సిన్ ధర 40 శాతం తగ్గింపు..



మలేరియా మహమ్మారి నుంచి చిన్నారులను రక్షించేందుకు భారత్ బయోటెక్ కీలక ముందడుగు వేసింది. అంతర్జాతీయ సంస్థలు ‘గవి’, ‘యునిసెఫ్’తో కలిసి మలేరియా వ్యాక్సిన్ ధరను దాదాపు 40 శాతం తగ్గించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ప్రస్తుతం ఒక్క డోసుకు 9.30 యూరోలుగా ఉన్న ధర 5.50 యూరోలకు తగ్గనుంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.600 లోపే ఉంటుంది. ఈ తగ్గింపు 2027 ప్రారంభం నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ నిర్ణయంతో 2027-2029 మధ్య చిన్నారుల టీకా కార్యక్రమాలకు దాదాపు 50 మిలియన్ డాలర్లు ఆదా కానున్నాయి. ఈ నిధులతో మరో 10 లక్షల మంది పిల్లలకు మలేరియా వ్యాక్సిన్ అందించవచ్చని అంచనా.

### మలేరియా వ్యాక్సిన్ ‘మాస్కివాక్’

భారత్ బయోటెక్ ఈ వ్యాక్సిన్‌ను ‘మాస్కివాక్’ పేరుతో తయారు చేస్తోంది. దీని అసలు పేరు ఆర్‌టీఎస్, ఎస్/ఏఎస్01. జీఎస్‌కే, పాత్ సంస్థలు, వాటి భాగస్వాములు అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 2021లో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) చిన్నారుల్లో మలేరియా నివారణ కోసం విస్తృత వినియోగానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం దీని తయారీ బాధ్యతలను జీఎస్‌కే నుంచి భారత్ బయోటెక్‌కు బదిలీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి, మరిన్ని దేశాలకు వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకురావడం దీని ప్రధాన లక్ష్యం.

### నాలుగు డోసులు తీసుకుంటే..

ఈ వ్యాక్సిన్‌ను నాలుగు డోసుల కోర్సుగా ఇస్తారు. మలేరియా వ్యాప్తి కాలానుగుణంగా ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సరైన సమయంలో నాలుగు డోసులు తీసుకుంటే మలేరియా కేసులు సుమారు 75 శాతం తగ్గే అవకాశం ఉందని యునిసెఫ్ తెలిపింది. అయితే, ఈ వ్యాక్సిన్ పూర్తిస్థాయి రక్షణ ఇవ్వదు. దోమతెరలు వాడటం, దోమల నియంత్రణ చర్యలు చేపట్టడం, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం కూడా అవసరం. ప్రపంచవ్యాప్తంగా 2024లో సుమారు 28.2 కోట్ల మలేరియా కేసులు నమోదయ్యాయి. ఈ వ్యాధితో 6.10 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అత్యధిక మరణాలు ఆఫ్రికాలోనే సంభవించాయి. ఆ ప్రాంతంలో ఐదేళ్లలోపు చిన్నారులే ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. ప్రస్తుతం 25 ఆఫ్రికా దేశాల్లో సాధారణ టీకా కార్యక్రమాల్లో మలేరియా వ్యాక్సిన్‌ను చేర్చారు. యునిసెఫ్ ఇప్పటివరకు 7.4 కోట్లకు పైగా డోసులను సేకరించి పంపిణీ చేసింది.

## తిరుపతిలో డీజీపీ, ఐజీల జాతీయ సదస్సు..

దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతలకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించే వార్షిక సదస్సు ఈసారి తిరుపతిలో జరగనుంది. దేశంలోని అన్ని రాష్ట్రాల డీజీపీలు, ఐజీలతో పాటు కేంద్ర పోలీస్ సంస్థల అధిపతులు పాల్గొనే ఈ జాతీయ స్థాయి సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారు. డిసెంబర్ 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (××ూజు=) ప్రాంగణంలో ఈ సదస్సు జరగనుంది. ఈ ఉన్నతస్థాయి సమావేశం నిర్వహణకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఇందులో భాగంగా సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జి. సాయిప్రసాద్ సంబంధిత శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధాని, కేంద్ర హోంమంత్రి సహా దేశంలోని పోలీసు ఉన్నతాధికారులందరూ హాజరవుతున్నందున, భద్రత, వసతి, రవాణా తదితర అంశాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లకు ఆస్కారం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమకు కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి జె. శ్యామల రావు, ఐపీఎస్ అధికారి కాంతి రాణా టాటా, ఎస్ఐబీ డిప్యూటీ డైరెక్టర్ అంబిక తదితరులు పాల్గొన్నారు. అలాగే, తిరుపతి కలెక్టర్ డా. వెంకటేశ్వర్, ఎస్పీతో పాటు ఇతర అధికారులు వర్చువల్ విధానంలో పాలుపంచుకున్నారు.

మన సమగ్ర ప్రజావాణి RNI NO:TGTEL/25/A5443
గురువారం . సెప్టెంబర్. 03. 2026 తెలుగు దినపత్రిక
మంగళవారం 27 అక్టోబర్ 2026

## బిజినెస్

### ప్రైవేటు బ్యాంకులు.. పటిష్ట లాభాలు




ప్రయివేట్ రంగ దిగ్గజం కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026--27) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. వార్షికంగా జూలై--సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 26 శాతం ఎగసి రూ. 5,645 కోట్లకు చేరింది. స్టాండెలోన్ నికర లాభం సైతం 29 శాతం జంప్‌చేసి రూ. 4,212 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం, ప్రొవిజన్లు తగ్గడం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 16 శాతం వృద్ధితో రూ. 8,459 కోట్లకు చేరింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.39 శాతం నుంచి 1.04 శాతానికి దిగివచ్చాయి. స్లిప్పేజీలు రూ. 1,629 కోట్ల నుంచి రూ. 1,230 కోట్లకు తగ్గాయి. మొత్తం ప్రొవిజన్లు 15 శాతం వెనకడుగుతో రూ. 803 కోట్లకు పరిమితమయ్యాయి. ప్రయివేట్ రంగ సంస్థ ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2026--27) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. వార్షికంగా జూలై--సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం మూడు రెట్లు దూసుకెళ్లి రూ. 1,045 కోట్లకు చేరింది. గతేడాది(2025--26) ఇదే కాలంలో కేవలం రూ. 352 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 11,828 కోట్ల నుంచి రూ. 14,218 కోట్లకు జంప్‌చేసింది. వడ్డీ ఆదాయం సైతం రూ. 9,937 కోట్ల నుంచి రూ. 11,922 కోట్లకు ఎగసింది. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 1.86 శాతం నుంచి 1.32 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.52 శాతం నుంచి 0.4 శాతానికి దిగివచ్చాయి. కనీస మూలధన నిష్పత్తి 14.67 శాతంగా నమోదైంది.

### 4 రోజుల నష్టాలకు బ్రేక్..
### లాభాల్లో ముగిసిన సూచీలు

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు (సెన్సెక్స్ నిఫ్టీ) లాభాల్లో ముగిశాయి. ఓ వైపు అంతర్జాతీయంగా చమురు ధరలు గరిష్ఠ స్థాయిల వద్ద కొనసాగుతున్నప్పటికీ.. ఫార్మా, హెల్త్‌కేర్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు రాణించాయి. దీంతో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఉదయం 72,990.04 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,123.83) నష్టాల్లో ప్రారంభమైంది. కాసేపటి తర్వాత లాభాల్లోకి వచ్చిన సూచీ.. చివరికి 482.92 పాయింట్ల లాభంతో 73,606.75 వద్ద ముగిసింది. నిఫ్టీ 153.20 పాయింట్ల లాభంతో 22,753.20 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.19గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఎటర్నల్, కోటక్ మహీంద్రా, ట్రెంట్, టాటా స్టీల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మారుతీ సుజుకీ, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 115 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4018 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# నగదు చలామణిలో వృద్ధి అయిదేళ్ల గరిష్ఠానికి



దేశీయంగా ఈనెల 15వ తేదీ నాటికి చలామణిలో ఉన్న నగదు విలువ రూ.43.46 లక్షల కోట్లకు చేరిందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. గతేడాది ఇదే సమయం కంటే ఇది 13.5% ఎక్కువని, ఈ వృద్ధి అయిదేళ్ల గరిష్ఠమని వెల్లడించింది. రిజర్వ్ మనీ కూడా 10.3% వృద్ధితో రూ.53.24 లక్షల కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు 30తో ముగిసిన పక్షంలో కూడా చలామణిలో ఉన్న నగదు వృద్ధి 13.3 శాతంగా నమోదైంది.

**ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్ల వల్లేనా?**

రూపాయి పతనాన్ని ఆపే లక్ష్యంతో జూన్ 8న ప్రవేశపెట్టిన ఫారిన్ కరెన్సీ నాన్-రెసిడెంట్ (బ్యాంక్) /ఎఫ్‌సీఎన్‌ఆర్(బీ) డిపాజిట్ పథకమూ చలామణిలో ఉన్న కరెన్సీ వృద్ధికి ప్రధాన కారణాల్లో ఒకటిగా భావిస్తున్నారు. ఈ పథకం కింద ఆగస్టు 31 వరకు బ్యాంకులు 133 బిలియన్ డాలర్లు సమీకరించాయి.

2025-26లో బహిరంగ మార్కెట్ కార్యకలాపాల ద్వారా రూ.8.8 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ సెక్యూరిటీలను ఆర్‌బీఐ కొనుగోలు చేసి, వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరంలోనూ స్వాప్ సదుపాయాల ద్వారా ద్రవ్య లభ్యత పెంచింది.

ప్రస్తుతం అదనపు ద్రవ్య లభ్యతను ఉపసంహరించుకోవడాన్ని ఆర్‌బీఐ ప్రారంభించింది. విదేశీ మారకపు ద్రవ్య మార్కెట్లో ఆర్‌బీఐ జోక్యం కొనసాగడం, పండగల సమయంలో ప్రజలు అధికంగా నగదు వినియోగించడం వల్ల.. బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత మరింత తగ్గొచ్చు. దీనివల్ల రిజర్వ్ మనీ వృద్ధి మందగించే అవకాశం ఉంది.

**ఒడుదొడుకులు తట్టుకుంటున్నాం**

మన దేశం ఇంధనాన్ని అధికంగా దిగుమతి చేసుకుంటున్నా.. దేశీయ వినియోగం/సేవల రంగం బలంగా ఉండటం వల్ల ప్రపంచ ఆర్థిక పరిణామాల ప్రభావాన్ని తట్టుకోగలుగు తున్నట్లు ఆర్‌బీఐ వివరించింది. రిటెయిల్ ద్రవ్యోల్బణం పెరుగుతూ, వివిధ వస్తువుల ధరలు అధికమవుతున్నందున.. నియంత్రణకు తగిన ద్రవ్య విధాన చర్యలు అవసరమని ఆర్థిక వేత్తలు భావిస్తున్నారు.

# హ్యుందాయ్ నుంచి మిడ్‌సైజ్ ఎస్‌యూవీ..






ఇంటర్నెట్ డెస్క్: హ్యుందాయ్ మోటార్ ఇండియా మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో బేయాన్‌ను లాంచ్ చేసింది. దీని ధరను రూ.9.99 లక్షలుగా (ఎక్స్ షోరూమ్) కంపెనీ నిర్ణయించింది. హ్యుందాయ్ వెబ్‌సైట్ లేదా ఆథరైజ్డ్ డీలర్‌షిప్స్ వద్ద రూ.11 వేలు చెల్లించి దీనిని బుక్ చేసుకోవచ్చు. మిడ్‌సైజ్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో మారుతీ సుజుకీ విక్టోరిస్‌తో ఇది పోటీ పడనుంది.

హ్యుందాయ్ బేయాన్ 4,245 ఎంఎం పొడవు, 1810 ఎంఎం వెడల్పు, 2600 ఎంఎం వీల్‌బేస్‌తో వస్తోంది. 205 ఎంఎం గ్రౌండ్ క్లియరెన్స్ ఇచ్చారు. స్ప్లిట్ హెడ్‌ల్యాంప్, స్లిమ్ ఎల్ఈడీ డీఆర్ఎల్స్ ఉన్నాయి. పెటల్ స్టైల్ అల్లాయ్ వీల్స్ ఇచ్చారు. 505 లీటర్ల బూట్ స్పేస్ కల్పించారు.

ఇంటీరియర్ విషయానికొస్తే.. 12.3 అంగుళాలు కలిగిన రెండు డ్యాష్‌బోర్డులు ఇచ్చారు. ఒకటి ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, మరొకటి ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ కోసం కేటాయించారు. దేశంలోనే తొలిసారి జనరేటివ్ ఏఐ వాయిస్ అసిస్టెంట్ సదుపాయాన్ని ఇందులో అందిస్తున్నారు. 70 రకాల కనెక్టెడ్ ఫీచర్లు కలిగిన హ్యుందాయ్ బ్లూలింక్ సదుపాయం ఉంది.

ఇందులో 1.5 లీటర్ ఫోర్ సిలిండర్ నేచురల్ యాస్పిరేటెడ్ ఎంపీఐ పెట్రోల్ ఇంజిన్ ఇచ్చారు. ఇది 115 బీహెచ్‌పీ పవర్‌ను, 144 ఎన్ఎం టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. సిక్స్ స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, హ్యుందాయ్ ఇంటిలిజెంట్ వేరియబుల్ ట్రాన్స్‌మిషన్ (ఐవీటీ), ఐవీటీ ఆప్షన్లతో లభిస్తుంది. సీవీటీ వేరియంట్ లీటర్‌కు 18.6 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని తెలిపింది.

ఇందులో ఎకో, నార్మల్, స్పోర్ట్ డ్రైవ్ మోడ్స్ ఉన్నాయి. ఆరు ఎయిర్‌బ్యాగులు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, హ్యుందాయ్ స్మార్ట్‌సెన్స్ లెవల్ 2 ప్రోఆక్టివ్ ఫీచర్లు ఉన్నాయి. ఫార్వర్డ్ కొలిజన్ వార్నింగ్, బ్లైండ్ స్పాట్ కొలిజన్ వార్నింగ్, లేన్ కీపింగ్ అసిస్ట్, లేన్ డిపాచర్ వార్నింగ్, డ్రైవింగ్ అటెన్షన్ వార్నింగ్ వంటి సదుపాయాలు ఉన్నాయి.

## సిరీస్ ఆశలు నిలవాలంటే కివీస్ గెలవాల్సిందే..
# హ్యాట్రిక్ విజయంపై భారత్ కన్ను!

సిరీస్ లో 0-2తో వెనుకబడిన కివీస్
హెన్రీ, ఫెర్గూసన్ దూరం.. ఆతిథ్య జట్టుకు ఎదురుదెబ్బ
హ్యాట్రిక్ విజయంపై టీమ్‌ఇండియా గురి
వెల్లింగ్టన్ గాలులు, చిన్న బౌండరీలతో కొత్త సవాలు
రెండో టీ20లో నాలుగు వికెట్లు తీసిన శాంట్నర్‌తో ప్రమాదం




న్యూజిలాండ్‌తో మూడో టీ20కి రంగం సిద్ధమైంది. వరుసగా రెండు విజయాలతో జోరుమీదున్న టీమిండియా మరో గెలుపుతో సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తోంది. మరోవైపు సొంతగడ్డపై ఇప్పటికే రెండు మ్యాచ్‌ల్లో ఓడిన న్యూజిలాండ్‌కు ఇది చావోరేవో పోరు. ఈ మ్యాచ్‌లోనూ ఓడితే సిరీస్ చేజారిపోతుంది. కీలకమైన ఈ పోరుకు ముందు కివీస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ జట్టు ప్రధాన పేసర్లు మాట్ హెన్రీ, లాకీ ఫెర్గూసన్ మూడో టీ20కి దూరమయ్యారు. దీంతో ఒత్తిడిలో ఉన్న ఆతిథ్య జట్టుకు సవాలు మరింత పెరిగింది. క్రైస్ట్‌చర్చ్‌లో జరిగిన రెండో టీ20లో మాట్ హెన్రీ కేవలం రెండు ఓవర్లే బౌలింగ్ చేశాడు. అందులో ఒకటి మెయిడిన్. కాలి కండరాల సమస్యతో ఇబ్బందిపడిన అతడిని మిగిలిన సిరీస్ నుంచి తప్పించారు. ఇతర ఫార్మాట్లకు సిద్ధమయ్యేందుకు అతడి పనిభారాన్ని తగ్గించాలని జట్టు నిర్ణయించింది. లాకీ ఫెర్గూసన్ కూడా రెండో మ్యాచ్‌లో పూర్తి కోటా ఓవర్లు వేయకుండానే మైదానం వీడాడు. ముందు జాగ్రత్త చర్యగా అతడికి మూడో మ్యాచ్‌లో విశ్రాంతి ఇవ్వనున్నారు. ఈ ఇద్దరు లేకపోవడంతో ఆడమ్ మిల్నే, బ్లెయిర్ టిక్నర్‌లపై కివీస్ ఆధారపడాల్సి ఉంటుంది. కైల్ జేమీసన్ కూడా వెల్లింగ్టన్ మ్యాచ్ ఆడిన తర్వాత టెస్టు సిరీస్‌కు సన్నద్ధమయ్యేందుకు ఫోర్డ్ ట్రోఫీలో పాల్గొననున్నాడు.

**గెలుపు జోరులో భారత్..**
**భువీపై ప్రత్యేక దృష్టి**

మరోవైపు టీమిండియా ఇప్పటివరకు అన్ని విభాగాల్లోనూ మెరుగైన ప్రదర్శన చేసింది. తొలి మ్యాచ్‌కు ముందు ఒక్కసారి మాత్రమే ప్రాక్టీస్ చేసినప్పటికీ, బ్యాటింగ్‌లో సత్తా చాటింది. తొలి టీ20లో 226 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్.. రెండో మ్యాచ్‌లో 181 పరుగుల లక్ష్యాన్నీ అందుకుంది. అయితే న్యూజిలాండ్ ఫీల్డింగ్, బౌలింగ్‌లో చేసిన తప్పిదాలు కూడా భారత్ విజయాలకు కారణమయ్యాయి. భారత సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ మాత్రం తన స్థాయికి తగ్గ ప్రదర్శన చేయాల్సి ఉంది. ఈ సిరీస్‌లో ఇప్పటివరకు ఎనిమిది ఓవర్లు వేసి 99 పరుగులు ఇచ్చిన అతడు ఒక్క వికెట్ మాత్రమే తీశాడు. వెల్లింగ్టన్‌లోనైనా పుంజుకుంటాడని భారత జట్టు ఆశిస్తోంది.

**గాలులు.. చిన్న బౌండరీలు కీలకం!**

వెల్లింగ్టన్‌లోని హెచ్‌ఎన్‌ఆర్‌వై స్టేడియం పరిస్థితులు భారత్‌కు కొత్త సవాలు విసరనున్నాయి. 'కేక్ టిన్'గా పేరున్న ఈ మైదానంలో సాధారణంగా బలమైన గాలులు వీస్తుంటాయి. ఇక్కడి పిచ్ కూడా డ్రాప్-ఇన్ పిచ్. మైదానానికి ఇరువైపులా స్క్వేర్ బౌండరీలు సుమారు 60 మీటర్లే ఉండటంతో బ్యాటర్లు భారీ షాట్లతో విరుచుకుపడే అవకాశం ఉంది. ఈ పరిస్థితులకు తగ్గట్టుగా భారత బౌలర్లు తమ వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుంది. ఇక గాయం నుంచి పూర్తిగా కోలుకోని ఇషాన్ కిషన్ మూడో మ్యాచ్‌కూ అందుబాటులో ఉండడం లేదు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఇంకా కోలుకుంటున్నాడు. దీంతో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీకి మరోసారి మూడో స్థానంలో బ్యాటింగ్ చేసే అవకాశం దక్కనుంది. గత మ్యాచ్‌లో ఆడిన జట్టుతోనే భారత్ బరిలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి.

**గణాంకాల్లోనూ భారత్‌దే పైచేయి**

న్యూజిలాండ్‌తో టీ20ల్లో భారత్ రికార్డు మెరుగ్గా ఉంది. ఇరు జట్ల మధ్య జరిగిన 33 టీ20ల్లో భారత్ 21 గెలవగా, న్యూజిలాండ్ 11 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. ఒక మ్యాచ్ టైగా ముగిసింది. న్యూజిలాండ్ గడ్డపై ఆడిన 14 టీ20ల్లోనూ భారత్ తొమ్మిది విజయాలు సాధించింది. భారత బ్యాటర్ తిలక్ వర్మ ఛేజింగ్‌లో కీలక ఆటగాడిగా ఎదిగాడు. టీ20ల్లో లక్ష్య ఛేదన సమయంలో అతడి సగటు 51.6 కాగా, తొలుత బ్యాటింగ్ చేసినప్పుడు 39.7గా ఉంది. తిలక్ నాటౌట్‌గా నిలిచిన 12 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లోనూ భారత్ గెలిచింది. మొత్తం టీ20 క్రికెట్‌లో అతడు నాటౌట్‌గా ముగించిన 26 ఇన్నింగ్స్‌ల్లోనూ అతడి జట్టే విజయం సాధించడం విశేషం. 2025 నుంచి ఇప్పటివరకు 52 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 1,282 పరుగులు చేసిన తిలక్.. 41.4 సగటు, 141.7 స్ట్రైక్‌రేట్‌తో రాణించాడు. అయితే భారత బ్యాటర్లకు కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ నుంచి ముప్పు పొంచి ఉంది. రెండో టీ20లో అతడు నాలుగు వికెట్లు పడగొట్టాడు. 2025లో స్పిన్ బౌలింగ్‌లో భారత బ్యాటర్లు సగటున 58.2 పరుగులు చేయగా, 2026లో ఆ సగటు 27.3కు పడిపోయింది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది స్పిన్నర్ల బౌలింగ్‌లో భారత్ వికెట్లు వేగంగా కోల్పోతోంది. ఈ బలహీనతను శాంట్నర్ మరోసారి ఉపయోగించుకోవాలని చూస్తున్నాడు. మొత్తానికి, భారత్ హ్యాట్రిక్ విజయంతో సిరీస్‌ను సొంతం చేసుకుంటుందా? లేక కివీస్ పుంజుకుని పోరును ఆసక్తికరంగా మారుస్తుందా? అనేది చూడాలి.

**మ్యాచ్ వివరాలు**

**తేదీ: అక్టోబర్ 27, మంగళవారం**
**సమయం: మధ్యాహ్నం 12.30 గంటలకు**
**వేదిక: హెచ్‌ఎన్‌ఆర్‌వై స్టేడియం, వెల్లింగ్టన్**
**ప్రత్యక్ష ప్రసారం: సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్**
**లైవ్ స్ట్రీమింగ్: సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్**

## స్పోర్ట్స్

### ఒక్క పరుగు తేడాతో డబుల్ సెంచరీ మిస్..
### న్యూజిలాండ్-ఎ పై పడిక్కల్ దండయాత్ర

న్యూజిలాండ్-ఎతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో పడిక్కల్ వీరవిహారం
248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్సర్లతో 199 పరుగులు
అంపైర్ వివాదాస్పద నిర్ణయంతో డబుల్ సెంచరీ మిస్
సాయి సుదర్శన్, యష్ రాథోడ్‌లతో భారీ భాగస్వామ్యాలు
తొలి ఇన్నింగ్స్ వెనుకబాటు నుంచి ఇండియా-ఎ ఊహించని కంబ్యాక్



న్యూజిలాండ్-ఎ జట్టుతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో భారత్-ఎ జట్టు అద్భుత పునరాగమనం (కంబ్యాక్) సాధించింది. భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ (199) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మ్యాచ్‌పై ఇండియా-ఎ పూర్తి ఆధిపత్యం సాధించింది. బెర్ట్ సట్‌క్లిఫ్ ఓవల్ మైదానంలో జరుగుతున్న ఈ మ్యాచ్ మూడో రోజు పోరులో పడిక్కల్ సుడిగాలి సెంచరీతో జట్టును సురక్షిత తీరానికి చేర్చాడు. పడిక్కల్ 248 బంతుల్లో 24 ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో 80.24 స్ట్రైక్ రేట్‌తో 199 పరుగులు సాధించాడు. అయితే టీ విరామానికి 10 నిమిషాల ముందు జాక్ గిబ్సన్ బౌలింగ్‌లో అంపైర్ ఇచ్చిన క్యాచ్ ఔట్ నిర్ణయంతో పడిక్కల్ తీవ్ర అసంతృప్తికి లోనయ్యాడు. బంతి బ్యాట్‌కు అసలు తగలలేదని సైగలు చేస్తూ, మైదానంలోనే అంపైర్ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నిరాశగా వెనుతిరిగాడు. కేవలం ఒక్క పరుగు తేడాతో ద్విశతకం (డబుల్ సెంచరీ) చేజార్చుకున్నప్పటికీ, అతడు ఆడిన ఇన్నింగ్స్ మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది.

**ఘోర పతనం నుంచి అద్భుత కంబ్యాక్!**

ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇండియా-ఎ కేవలం 113 పరుగులకే కుప్పకూలగా, న్యూజిలాండ్ 'ఎ' 317 పరుగులు చేసి 204 పరుగుల భారీ ఆధిపత్యాన్ని సాధించింది. రెండో ఇన్నింగ్స్ ప్రారంభంలోనూ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్‌లు 9 పరుగులకే పెవిలియన్ చేరడంతో భారత్ తీవ్ర కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన పడిక్కల్, సాయి సుదర్శన్ (91)తో కలిసి మూడో వికెట్‌కు ఏకంగా 215 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆ తర్వాత యష్ రాథోడ్‌తో కలిసి మరో 142 పరుగుల విలువైన భాగస్వామ్యాన్ని జోడించాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇండియా-ఎ 6 వికెట్ల నష్టానికి 378 పరుగులు చేసి, 174 పరుగుల ఆధిక్యంలో నిలిచింది.

**రేసులో పడిక్కల్.. టెస్టు బెర్త్ కోసం గట్టి పోటీ!**

టెస్ట్ క్రికెట్‌లో పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. శ్రీలంక పర్యటనలో స్పిన్నర్లపై ధాటిగా ఆడిన అతడు, ఇప్పుడు న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లపై కూడా సత్తా చాటాడు. రాబోయే సీనియర్ టెస్ట్ జట్టులో మూడో స్థానం కోసం పోటీపడుతున్న సాయి సుదర్శన్, పడిక్కల్‌లు ఇద్దరూ ఈ మ్యాచ్‌లో రాణించడం విశేషం. నాలుగు రోజుల ఈ మ్యాచ్ ఆఖరి రోజున భారత్ విజయం సాధించే దిశగా అడుగులు వేస్తోంది.

ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
మంగళవారం 27 అక్టోబర్ 2026



## రవిబాబు హారర్ సినిమాలో కంగనా రనౌత్

వైవిధ్యమైన కథలు, విభిన్నమైన చిత్రాలతో ప్రేక్షకులను ఆకట్టుకునే దర్శకుడు రవిబాబు మరో ఆసక్తికరమైన ప్రాజెక్టుతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్ 'రేజర్'తో ప్రేక్షకులను పలకరించిన ఆయన.. ఇప్పుడు హారర్ కథాంశంతో సినిమా తెరకెక్కించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాలో బాలీవుడ్ నటి కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించబోతున్నారనే వార్తలు సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ముందస్తు పనులు పూర్తయ్యాయని, చిత్రీకరణ కూడా రహస్యంగా జరుగుతోందని కొన్ని కథనాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ వార్తలపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. కంగనా నిజంగానే ఈ సినిమాలో నటిస్తున్నారా? ఒకవేళ నటిస్తే ఆమె పాత్ర ఎలా ఉండబోతోంది? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.కంగనా రనౌత్ వంటి బాలీవుడ్ స్టార్.. రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమాలో నటించబోతున్నారనే ప్రచారం నిజమైతే ఈ ప్రాజెక్టుపై అంచనాలు పెరిగే అవకాశం ఉంది. కంగనా రనౌత్ గతంలో ప్రభాస్ కథానాయకుడిగా నటించిన 'ఏక్ నిరంజన్' సినిమాలో హీరోయిన్‌గా కనిపించారు. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ద్వారా ఆమె తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అదే ఆమె నటించిన ఏకైక తెలుగు చిత్రంగా ఇప్పటివరకు గుర్తింపు పొందింది. ఇప్పుడు రవిబాబు దర్శకత్వంలో హారర్ సినిమా చేస్తున్నారనే ప్రచారం నిజమైతే.. దాదాపు 17 ఏళ్ల తర్వాత ఆమె మరోసారి తెలుగు సినిమాలో కనిపించే అవకాశం ఉంటుంది. దీంతో ఈ వార్తపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది.మరోవైపు కంగనా రనౌత్ ప్రస్తుతం పలు చిత్రాలతో బిజీగా ఉన్నారు. 'క్వీన్ 2', 'సర్కిల్', 'తను వెడ్స్ మను 3' వంటి ప్రాజెక్టులకు సంబంధించి వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆమె తెలుగు సినిమా చేయబోతున్నారనే ప్రచారం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.అయితే రవిబాబు దర్శకత్వంలో తెరకెక్కనున్నట్లు చెబుతున్న హారర్ సినిమాలో కంగనా నటిస్తున్నారా? చిత్రీకరణ నిజంగానే ప్రారంభమైందా? అనే అంశాలపై ఆమె బృందం లేదా చిత్రబృందం నుంచి అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. అప్పటివరకు ఈ క్రేజీ కాంబినేషన్‌పై వస్తున్న వార్తలను ప్రచారంగానే పరిగణించాలి.

## ప్రభాస్ 'ఫౌజీ'కి చిక్కులు.. నేతాజీ చరిత్రను వక్రీకరించారంటూ దర్శకుడిపై విమర్శలు!





యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'ఫౌజీ' చుట్టూ వివాదం మొదలైనట్లు వార్తలు వస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ చరిత్రకు సంబంధించిన అంశాలను సినిమాలో వక్రీకరించారనే ఆరోపణలు తెరపైకి వచ్చాయి. ఈ విషయంపై నేతాజీ మనవడు, ఆయన కుటుంబానికి చెందిన చంద్రకుమార్ బోస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. చరిత్రను తప్పుగా చూపించినందుకు చిత్ర దర్శకుడు భారత ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ జీవితానికి సంబంధించిన అంశాలను చిత్రాల్లో చూపించే విషయంలో దర్శకులు జాగ్రత్తగా వ్యవహరించాలని చంద్రకుమార్ బోస్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా నేతాజీ, జర్మనీ నియంత అడాల్ఫ్ హిట్లర్‌తో సమావేశమైన సందర్భాన్ని సినిమాలో తప్పుగా చిత్రీకరించారనే ఆరోపణలు ఆయన చేశారు. స్వాతంత్ర్య పోరాటం, దానికి నాయకత్వం వహించిన ప్రముఖుల గురించి సినిమాలు తీయడానికి చిత్రనిర్మాతలకు స్వేచ్ఛ ఉంది కాని, సృజనాత్మక స్వేచ్ఛ పేరుతో చారిత్రక వాస్తవాలను వక్రీకరించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. జాతీయ నాయకుల గురించి సినిమాలు తీసేటప్పుడు వాస్తవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రకుమార్ బోస్ వ్యాఖ్యానించారు. చారిత్రక అంశాలను తప్పుగా చూపిస్తూ కల్పిత కథనాలను జోడించడం నేరంతో సమానమని ఆయన అభిప్రాయపడ్డారు. నేతాజీ హిట్లర్‌తో జరిపిన భేటీకి సంబంధించిన అంశాలను వక్రీకరించడం ద్వారా స్వాతంత్ర్య సమరయోధుడి స్థాయిని తగ్గించినట్లుగా సినిమా ఉందని ఆయన ఆరోపించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 'ఫౌజీ' దర్శకుడు భారత ప్రజలకు, దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని గౌరవించే వారందరికీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేసారు. ప్రభాస్ నటిస్తున్న 'ఫౌజీ'పై వచ్చిన ఈ ఆరోపణలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అయితే చంద్రకుమార్ బోస్ చేసిన ఆరోపణలకు సంబంధించి చిత్రబృందం అధికారికంగా స్పందిస్తుందా, సినిమాలో నేతాజీకి సంబంధించిన సన్నివేశాలను ఏ విధంగా చిత్రీకరించారు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రస్తుతం ఈ వివాదానికి సంబంధించి ఆరోపణలు మాత్రమే వెలుగులోకి వచ్చాయి. చిత్రబృందం వివరణ లేదా సినిమాలోని సంబంధిత సన్నివేశాలపై పూర్తి సమాచారం అందుబాటులోకి వచ్చిన తర్వాతే ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## వరుస పాన్ ఇండియా సినిమాలతో గోపీచంద్ కమ్‌బ్యాక్..







టాలీవుడ్ మ్యాచో స్టార్ గోపీచంద్ వరుస పరాజయాల నుంచి బయటపడి సాలిడ్ కమ్‌బ్యాక్ ఇవ్వాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో తనకు విజయాలు అందించిన తరహా కథలకే పరిమితం కాకుండా, కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఆయన చేతిలో రెండు ప్రతిష్ఠాత్మక పాన్ ఇండియా ప్రాజెక్టులు ఉన్నాయి. ఈ సినిమాలతోనైనా బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటాలని గోపీచంద్ ప్రయత్నిస్తున్నారు. గోపీచంద్ నటిస్తున్న చిత్రాల్లో 'భరతవర్ష' ఒకటి. సంకల్ప్ రెడ్డి దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులపై దృష్టి సారించింది. ఇటీవల విడుదల చేసిన 'అమ్మ కదిలి వచ్చే' పాటతో సినిమా సంగీత ప్రచారాన్ని కూడా ప్రారంభించారు. విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాపై గోపీచంద్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. గత చిత్రాలకు భిన్నంగా ఈ సినిమా ఆయన కెరీర్‌కు ఎలాంటి మలుపు తీసుకొస్తుందోనని ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారు. మరోవైపు గోపీచంద్ 'సింగా' అనే పాన్ ఇండియా చిత్రంలోనూ నటిస్తున్నారు. ఈ సినిమాతో స్టంట్ కొరియోగ్రాఫర్ వెంకట్ మాస్టర్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. 70 ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ఇప్పటికే సగానికిపైగా పూర్తయినట్లు తెలుస్తోంది.ఈ సినిమాకు సామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు. తాజాగా విడుదలైన పోస్టర్ గోపీచంద్ పాత్రపై ఆసక్తిని పెంచింది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో మరో కీలక ప్రాజెక్టుగా నిలవనుంది. ప్రస్తుతం 'భరతవర్ష', 'సింగా' చిత్రాలతో బిజీగా ఉన్న గోపీచంద్.. విడుదల తేదీల విషయంలో మాత్రం తొందరపడటం లేదని తెలుస్తోంది. ఒక సినిమా షూటింగ్ పూర్తవగా, మరో సినిమా సగానికిపైగా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. అయినప్పటికీ ఇప్పటివరకు ఈ రెండు సినిమాల విడుదల తేదీలను ప్రకటించలేదు. చిత్రీకరణ, నిర్మాణానంతర పనులు, ఇతర ఏర్పాట్లు పూర్తిగా సిద్ధమైన తర్వాతే విడుదల తేదీని ప్రకటించాలని చిత్ర బృందాలు భావిస్తున్నట్లు సమాచారం. ముందుగానే తేదీ ప్రకటించి, చివరి నిమిషంలో వాయిదా వేయాల్సిన పరిస్థితి రాకుండా జాగ్రత్త పడుతున్నట్లు తెలుస్తోంది. గోపీచంద్ గత కొంతకాలంగా ఆశించిన విజయాలను అందుకోలేకపోతున్నారు. దీంతో ఈసారి కథల ఎంపికలో కొత్తదనానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

## జైలర్ 2 బాక్సాఫీస్ సునామీ..

సూపర్‌స్టార్ రజనీకాంత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తన సత్తా చాటుతున్నారని ట్రేడ్ వర్గాల గణాంకాలు చెబుతున్నాయి. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'జైలర్ 2' భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన మొదటి వారంలోనే మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం.. రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించినట్లు సమాచారం. ట్రేడ్ అంచనాల ప్రకారం, కేవలం 11 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.700 కోట్ల గ్రాస్ వసూళ్ల మార్కును దాటింది. దీంతో రజనీకాంత్ అభిమానుల్లో ఈ సినిమాపై ఉత్సాహం మరింత పెరిగింది. సాధారణంగా భారీ అంచనాలతో విడుదలైన సినిమాలకు తొలి వారాంతంలో మంచి వసూళ్లు వచ్చినప్పటికీ, ఆ తర్వాత కలెక్షన్లు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుంది. అయితే 'జైలర్ 2' విషయంలో రెండో వారాంతంలోనూ వసూళ్ల జోరు కొనసాగినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా రెండో ఆదివారం సినిమా కలెక్షన్లు పెరిగినట్లు సమాచారం. ఆ ఒక్క రోజే దేశవ్యాప్తంగా సుమారు రూ.25.70 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ గణాంకాలు పేర్కొంటున్నాయి. రెండో వారాంతంలోని మూడు రోజుల్లో కలిపి దాదాపు రూ.64.35 కోట్ల నెట్ వసూళ్లు వచ్చినట్లు అంచనా. ట్రేడ్ వర్గాల గణాంకాల ప్రకారం, 'జైలర్ 2' ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు రూ.710.35 కోట్లకు చేరినట్లు సమాచారం. ఇందులో దేశీయ మార్కెట్ నుంచి సుమారు రూ.466.85 కోట్లు, విదేశీ మార్కెట్ల నుంచి దాదాపు రూ.243.50 కోట్ల గ్రాస్ వచ్చినట్లు అంచనాలు చెబుతున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నికర వసూళ్లు సుమారు రూ.398.70 కోట్లకు చేరినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ఇదే జోరు కొనసాగితే త్వరలోనే రూ.400 కోట్ల నెట్ మార్కును కూడా అందుకునే అవకాశం ఉంది. అయితే ఇవి ట్రేడ్ అంచనాల ఆధారంగా వచ్చిన గణాంకాలు కావడంతో, అధికారిక వసూళ్ల వివరాలతో పోల్చి చూడాల్సి ఉంటుంది.




Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, peerzadi guda, GHMC, medchal malkaj giri AND PUBLICATIONS, , Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONSContact No : 9440032006. MAIL ID : prajavaani006@gmail.comepaper.prajavaani.net